
రామలింగేశ్వరుడి దర్శనం.. సర్వపాప హరణం

- దక్షిణ కాశీగా గురజాల శ్రీ రామలింగేశ్వరుడి క్షేత్రం ప్రసిద్ధి
- ఒకే ఆలయంలో ఐదు శివలింగాలు
- శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకత లింగం శివుడి మహత్వపూర్ణ రూపానికి దర్పణం
- నేటి నుంచి కార్తీక ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవదాయశాఖ


గురజాల రామలింగేశ్వరుడి క్షేత్రం


రామలింగేశ్వరుడి మూలవిరాట్

నందవరం : పవిత్ర శైవక్షేత్రాల్లో గురజాల రామలింగేశ్వరుడి క్షేత్రం ఒకటి. దక్షిణ కాశీగా పేరుగాంచిన గురజాల శ్రీ రామలింగేశ్వరుడి దర్శనం చేసుకుంటే సకల పాపలు తొలగిపోతాయని ఇక్కడి భక్తుల నమ్మకం. తుంగభద్ర నది తీరంలో అరుదైన శివలింగ సముదాయంతో వెసింది. ఈ పుణ్య క్షేత్రం. మహాభారతం, రామాయణ ఇతిహాసాల్లోని అరుదైన సంఘటనలకు సాక్ష్యం ఈ క్షేత్రం.

ఆలయ చారిత్రక నేపథ్యం

గురజాల శ్రీ రామలింగేశ్వరుడి ఆలయంలో ప్రతిష్ఠించిన పంచ శివలింగాలు దక్షిణ భారత దేశంలో మరెక్కడా కనిపించవు. శ్రీరామచంద్రుడు అరణ్యవాసం చేస్తూ ఈ ప్రాంతంలో ప్రతిష్ఠించిన సైకత లింగం శివుడి మహత్వపూర్ణ రూపానికి దర్పణం పడుతోంది. ఆంజనేయ స్వామి ప్రతిష్ఠించిన కాశి లింగం భక్తుల వరప్రదాయినిగా అలరారుతోంది. మహాభారతంలో పాండవరాజులలో అగ్రజుడైన ధర్మరాజు కూడా ఇక్కడ పర్యటిస్తూ ప్రతిష్ఠించిన లింగం ధర్మలింగం. యోధుడిగా పేరు గడించిన భీమసేనుడు ప్రతిష్ఠించిన భీమలింగం కూడా గురజాల క్షేత్రంలో వెలసింది. పాండవ మధ్యముడు వీరపరాక్రమ యోధుడు అర్జునుడు ప్రతిష్ఠించిన పార్థివ లింగం కూడా గురజాలలో వెలసి భక్తులకు కొంగు బంగారంగా పూజలందుకుంటోంది. ఐదు శివలింగాలు ఒకే ఆలయంలో దర్శనమివ్వడం భక్తుల మహాభాగ్యం. ఈ లింగాలను దర్శించి పూజిస్తే పాప విమోచన జరుగుతుందని భక్తుల నమ్మకం. అందుకే కార్తీక మాసంలో రామలింగేశ్వరుడికి విశిష్ట పూజలు గావిస్తారు.

నేటి నుంచి కార్తీక పూజలు

ఆధ్యాత్మిక శోభతో అలరారుతున్న గురజాల ఆలయానికి సాధారణంగానే భక్తుల తాకిడి ఉంటుంది. శనివారం కార్తీక మాస పూజలు ప్రారంభం కానున్నాయి. ఆదిదంపతులకు (శివపార్వతులకు)అభిషేకాల పూజలు గావిస్తారు. తుంగభద్ర నదీతీరంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఆదిదంపతులకు విశిష్ట పూజలు నిర్వహిస్తారు. తుంగభద్ర నది నిండుగా ప్రవహిస్తుతడంతో నది స్నానాలలో జాగ్రత్తలు పాటించాలని ఆలయ అధికారులు తెలుపుతున్నారు. కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు.

భక్తుల అన్ని సౌకర్యాలు

కార్తీక మాసం సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. పుణ్య స్నానాలు, పార్కింగ్, దైవ దర్శనానికి క్యూలైన్లు వంటి కల్పించాం. భక్తులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పిస్తున్నాం.

– రామ్‌ప్రసాద్, ఇన్‌చార్జ్ ఈఓ

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

కౌతాళం: మండలంలో ఉరుకుంద సమీపంలో వెలసిన బుడుములదొడ్డి ఆంజినేయస్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా భక్తుల సందడిగా నెలకుంది. ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఆంజినేయ స్వామిని దర్శించుకున్నారు. అలాగే తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయం అమావాస్య వేడుకలతో భక్తులు అధికంగా తరలివచ్చారు. కర్ణాటక సరహద్దు ప్రాంతం కావడంతో అధికంగా కన్నడ భక్తులు కూడా తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

హిందువుల మనోభావాలను కించపరచొద్దు

ఆదోని అర్బన్: లక్ష్మీ బాణాలను కాల్చి హిందువుల మనోభావాలను దెబ్బతీయొద్దని విరాట్ హిందూస్థాన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ క్రీడా మైదానంలో లక్ష్మీ బాణాలు విక్రయిస్తున్న 9 దుకాణాలను పరిశీలించారు. ఆ దుకాణాల్లో దొరికిన లక్ష్మీ బాణాలను నీటి టబ్‌లో వేసి పేలకుండా చేశారు. ఆయన మాట్లాడుతూ హిందువుల దేవుళ్లను పేల్చడం ద్వారా రోడ్డుపై పడడంతో ఆ దేవదేవతలను తొక్కడంతో హిందువుల మనోభావాలను ఎంతో దెబ్బతిన్నాయన్నారు. ఇలాంటి బాణాలను విక్రయిస్తే సంబంధిత శాఖలకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

కౌతాళం దర్గాలో అమావాస్య వేడుకలు


దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో శుక్రవారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వివిధ ప్రాంతా నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతేహాలను సమర్పించారు. దర్గా పరిసరా ప్రాంతాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేశారు.

రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారం


తిప్పనూరు సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ కుమారస్వామి

గోనెగండ్ల : రెవెన్యూ గ్రామ సభలలో భూ సమస్యలు పరిష్కరం అవుతాయని తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. శుక్రవారం మండలంలోని తిప్పనూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీ సర్వేలో ఎవరికైనా సమస్య ఉంటే ఈ సదస్సులో దరఖాస్తు చేసుకుంటే పరిష్కరం చూపుతామన్నారు. ఎర్రబాడు గ్రామంలో నిర్వహించిన సదస్సులో దాదాపు 50 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో రీ సర్వే డీటీ శిరీష, ఆర్ఐ, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కోసిగి: అక్షరాస్యతలో పూర్తిగా వెనుకబడిన మారుమూల కోసిగి ప్రాంతంలో బాల్య వివాహాలు జరుగకుండా అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ వరలక్ష్మి, హిరోజ, కోకన్వీనర్ రాజేశ్వరి కోరారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వారు మాట్లాడుతూ కోసిగి మండలంలో అత్యధికంగా పనుల కోసం ఇతర ప్రాంతాలు వలసలు వెళ్తున్నారన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలకు చదువులు ఎందుకని చదువుకునే బాలికలను మధ్యలో బడి మానిపించి తమ వెంటనే తీసుకెళ్లుతున్నారు. దీంతో వారు నిరక్షరాస్యులుగా మారే ప్రమాదం ఉందన్నారు. బాలికల ఉన్నత చదువులు చదివుకునేందుకు ఇంటర్మీడియెట్ వరకు హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకురాళ్లు అరుణమ్మ, సంతోషమ్మ, మేఘన, అంజలి, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందిస్తేనే ఉద్యోగులకు గుర్తింపు


ఆర్ఆర్ సింగ్‌ను సత్కరించిన డీఎం, సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: విధినిర్వహణలో మెరుగైన సేవలందింస్తేనే ఏ ఉద్యోగికైనా మంచి గుర్తింపు లభిస్తుందని స్థానిక ఆర్టీసీ డీఎం అమర్నాథ్ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ మెకానిక్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన కేయూ ఆర్ఆర్.సింగ్‌ను మేనేజర్‌తో పాటు, సిబ్బంది గురువారం డిపో ఆవరణలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ జీవీ నాగరాజు, అసిస్టెంట్ మెకానికల్ ఫోర్‌మెన్ పి.ఆంజినేయులు, యునియన్ నాయకులు ఎస్ఎం.రఫీక్, ముస్తాక్ అహమ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తోందని, నిరుద్యోగులకు ఇచ్చిన హామీ నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఎస్సీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీల్లో ఆ సంఘ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరులో నిరుద్యోగులకై ఉపాధి కల్పించేందుకు చేనేత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఉపాధికై ఉద్యమిద్దాం

ఆదోని రూరల్: అందరికీ విద్య, ఉపాధికై ఉద్యమిద్దామని డీవైఎఫ్ఐ పట్టణ నాయకులు మోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని మండిగిరి ఏరియాలో డీవైఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. డీవైఎఫ్ఐ పట్టణ నాయకులు మోహన్, పట్టణాధ్యక్షులు వీరేష్, నాయకులు రామనాయుడు, భీమ, నవీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాలధారణం..నియమాల తోరణం

- ప్రారంభమైన అయ్యప్ప, సాయిబాబా, వీరాంజనేయ తదితర దీక్షలు
- ఆధ్యాత్మిక శోభ నంతరించుకున్న ఆలయాలు


ఎమ్మిగనూరు అయ్యప్ప దేవాలయంలో పడిపూజ

ఎమ్మిగనూరు: మానసిక ప్రశాంతతకు మాలధారణ ఎంతో మందికి జీవితంలో ఒక భాగమైపోయింది. ప్రతిఏటా కార్తీక మాసం పాడ్యమి సందర్భంగా మాలధారణ మొదలవుతోంది. ఎమ్మిగనూరు పట్టణ, పరిసర గ్రామాల్లో భక్తులు తమకు ఇష్టదైవాలైన అయ్యప్ప, సాయిబాబా, వీరాంజనేయ, అమ్మభవాని, వెంకటేశ్వర స్వాముల మాలలు ధరించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా భక్తులు అధిక సంఖ్యలో దీక్షలు ధరించి మాలలు వేశారు. కార్తీకశుద్ధ పాడ్యమి రోజైన శుక్రవారం నుంచి ఎమ్మిగనూరు పట్టణంలోని దేవాలయాలు పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

మానసిక ప్రశాంతత

మాలధారణ కేవలం మొక్కుబడిగానే కాక నియమనిష్ఠలతో ఆచరిస్తారు. దీని వల్ల మనిషి మానసికంగా ప్రశాంతతను పొందడమే కాక శారీరకంగా అనారోగ్యాలకు దూరం అవుతాయని గురుస్వాములు ఈరన్న, మల్లిస్వామి చెబుతున్నారు. వేకువజామునే చన్నీళ్లతో స్నానం చేయడంతో పలు రోగాలు దూరమవుతాయని, అలాగే ఆహార నియమాలు ఆరోగ్యాన్ని కాపాడుతాయని పేర్కొంటున్నారు. సంవత్సరంలోని 365 రోజులలో 41 రోజులు నియమనిష్ఠలతో దీక్ష చేబూనడంతో మనిషిలో ఎంతో ఉత్సాహం, ఆలోచనా శక్తి పెరుగుతుంది. దురలవాట్లలతో వచ్చిన జబ్బులు దీక్షలో నయమవుతాయన్నది భావన.

కార్మిక సమస్యలపై పోరాటం

ఎమ్మిగనూరుటౌన్: కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తోందని ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మగురుడు అన్నారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక శ్రీనివాస థియేటర్ వద్ద ట్రాక్టర్ హమాలీ యూనియన్ కార్యాలయం ఆవరణలో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వీరేష్, విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ డివిజన్ కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

చందాలు ఇవ్వొద్దు

ఆదోని అర్బన్: మండలంలోని కుప్పగల్ గ్రామంలోని తిమ్మప్పస్వామి ఆలయంలో ఆవులు అమ్ముకున్న పూజారులు, చుట్టుపక్కల గ్రామాల్లో భక్తుల చేత చందాలు వసూలు చేస్తున్నారని, ఆలయ కమిటీ వారి దృష్టికి వచ్చిందని ఆలయ కమిటీ సభ్యులు తిమ్మారెడ్డి, తిక్కస్వామి తెలిపారు. స్థానిక విరాట్ హిందుస్థాన్ సంఘం కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎవరూ చందాలు ఇవ్వకూడదని, ఒకవేళ చందాలు ఇచ్చే పరిస్థితి వస్తే ఆలయ కమిటీ వారిచే రశీదు తీసుకోవాలన్నారు. కమిటీ సభ్యులు వెంకటేష్, హనుమంతు, ఆంజనేయులు, తిమ్మారెడ్డి, మంజునాథ్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని సంతెకూడ్లరు గ్రామానికి చెందిన సిద్ధమ్మ అనే మహిళ తన అంగడి వద్ద కర్ణాటక మద్యం అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర శుక్రవారం విలేకరులకు తెలిపారు. సదరు మహిళ నుంచి 90 ఎం.ఎల్. పరిమాణం గల 45 టీసీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఘనంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం


విద్యార్థులకు ఆంధ్ర రాష్ట్ర అవతరణ గురించి వివరిస్తున్న అవోపా సభ్యులు

ఆదోని అర్బన్: ఆంధ్ర రాష్ట్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆదోని పట్టణ ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీఎస్పీ బంగ్లా వద్ద ఉన్న మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంచి పెట్టి ఆంధ్ర రాష్ట్ర అవతరణ గురించి తెలిపారు. ప్రతిఒక్కరూ పొట్టి శ్రీరాములు సేవలను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్ష కార్యదర్శులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా, నాయకంటి రఘు, కోశాధికారి యాతిగిరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ బందోబస్తు మధ్య వేలం


వేలం నిర్వహిస్తున్న ఆదోని డివిజన్ మత్స్య శాఖ పర్యవేక్షకులు డి. నాగరాజు

కోసిగి: పులికనుమ రిజర్వాయర్‌లో చేపల పెంపకానికి వేలం పాటను పోలీస్ బందోబస్తు మధ్య నిర్వహించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పి. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బహిరంగ వేలం వేశారు. సర్కారు సవాల్ రూ.74,879 విలువ నిర్ణయించారు. రూ.10వేలు డిపాజిట్ పెట్టి 11 మంది పేర్లను నమోదు చేసుకున్నారు. రూ.82వేలకు ఎమ్మిగనూరుకు చెందిన అల్లూరి రెడ్డి అనే వ్యక్తి కైవసం చేసుకున్నాడు. గతంలో వివిధ కారణాల చేత రెండు సార్లు వేలం వాయిదా పడింది. చివరికి శుక్రవారం జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మూడో సారి ఎస్ఐ చంద్రమోహన్ సమక్షంలో పోలీస్ బందోబస్తు మధ్య వేలం ముగించేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు


రోడ్డుపై సామగ్రి పెడుతున్న దుకాణదారుడికి అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: దుకాణాల ముందు రోడ్డును ఆక్రమించుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు దుకాణ యజమానులను హెచ్చరించారు. శుక్రవారం వాహనాల తనిఖీలో భాగంగా స్థానిక ఎమ్మిగనూరు రోడ్డులోని కంట్రోల్ రూమ్ నుంచి తిక్కస్వామి దర్గా వరకు రోడ్డుకి ఇరువైపులా రోడ్డుని ఆక్రమించుకుని ఉన్న వ్యాపారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ దుకాణాల ముందు రోడ్డును ఆక్రమించుకుంటే రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంత కలుగుతుందని, దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. దుకాణాల ముందు రోడ్డుపై పెట్టిన వస్తువులను తీసివేయాలని సూచించారు. అనంతరం వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు సరిగా లేని వాహనాలకు జరిమానా విధించారు.

ఉరుకుందలో ఘనంగా లక్ష పుష్పార్చన


స్వామికి పూజలు చేపడుతున్న అర్చకులు


దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా ఆలయ డిప్యూటీ కమీషనర్ విజయరాజు ఆధ్వర్యంలో శుక్రవారం లక్షపుష్పార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. అమావాస్య రోజు ఇలాంటి పూజల్ని చేపట్టడం వల్ల భక్తుల్లో భక్తి భావం పెరుగుతుందన్నారు. గత నెల అమావాస్య నుంచే ఇలాంటి కార్యక్రమాలను చేపట్టినట్లు డీసీ తెలిపారు. ప్రతి అమావాస్యకు ఇలాంటి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. పుష్పార్చన పూజల్లో పాల్గొనలనుకున్న భక్తులు తమ పేర్లను ముందుగానే దేవాలయ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు

జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం వేలాది మంది భక్తులతో సందడిగా నెలకొంది. శుక్రవారం అమావాస్య ఉండడంతో భక్తులు తమ ఇలవేల్పును దర్శించుకోవాడానికి వేలాదిగా తరలివచ్చారు. దీపావళి పండుగ సందర్భంగా సెలవు రోజు కలిసి రావడంతో గురువారం సాయంత్రం నుంచే స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చి అమావాస్య వేడుకల్లో పాల్గొన్నారు. దేవాలయ పరిసర ప్రాంతాలన్ని భక్తులతో పోటెత్తాయి. దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. భక్తులకు విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, శ్రీఘ్ర దర్శనం, ఉచిత, వీఐపీ ద్వారాల ద్వారా దర్శనానికి పంపారు.

అవ్వాతాతలకు సర్వర్ కష్టాలు


గుడేకల్ సచివాలయం-2 వద్ద పింఛన్ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు


తిమ్మాపురం సచివాలయం వద్ద పింఛన్ కోసం అవ్వాతాతల అగచాట్లు

ఎమ్మిగనూరురూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి నెసా 1వ తేదీన వలంటీర్లు తెల్లవారుజామునే ఇంటికి వచ్చి పింఛన్లు పంపిణీ చేసేవారు. అయితే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక పింఛన్‌దారులకు కష్టాలు మొదలయ్యాయి. పింఛన్ల కోసం సచివాలయాలు, రచ్చబండల దగ్గర పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. శుక్రవారం సర్వర్ సమస్యతో మధ్యాహ్నం 12.30 గంటలు అయినా పింఛన్లు అవ్వతాతలకు అందకపోవటంతో సచివాలయాలు, పంచాయతీ భవనాల ముందు పడిగాపులు కాచారు. పింఛన్ల కోసం ఎదురుచూస్తూ అక్కడే లబ్ధిదారులు గంటల తరబడి ఉండిపోయారు. కొందరు వేచి ఉండలేక నిద్రపోయారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇలాంటి కష్టాలు ఎప్పుడు పడలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పని నిరీక్షణ

నందవరం : వలంటీర్ల వ్యవస్థ మురుగున పడడంతో పింఛన్‌దారుల కష్టాలు మళ్లీ మొదటికే వచ్చాయి. పింఛన్ లబ్ధిదారులు ఉదయం 7 గంటలకే సచివాలయాలు చుట్టూ పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్నారు. శుక్రవారం మండలంలో సర్వర్ సని చేయకపోవడంతో వృద్ధులు, వికలాంగులకు నిరీక్షణ తప్పలేదు. ఉదయం 7 గంటలకు సచివాలయాలకు వచ్చి 11 గంటల వరకు పింఛన్ కోసం ఎదురుచూపులు చూశారు. సర్వర్ పని చేయకపోవడంతో లబ్ధిరుదారులు ఇళ్లకు తిరిగి వెళ్లారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా తమ ఇళ్లకే పింఛన్లు అందేవని, తమకు ఈ కష్టాలు ఉండేవి కావాని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ముగతి, జొహరాపురం, ముగతి తదితర గ్రామాలలో సర్వర్ మొరాయించడంతో మధ్యాహ్నం 1 గంట నుంచి సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ ప్రారంభించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


శివమ్మతో హెచ్‌ఎం కృష్ణమూర్తి

ఎమ్మిగనూరు టౌన్: ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి 17 సంవత్సరాల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు పట్టణంలోని ఎంఎస్ మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని వి.శివమ్మ ఎంపికై నట్లు హెచ్‌ఎం కృష్ణమూర్తి శుక్రవారం తెలిపారు. 81ప్లస్ క్యాటగిరిలో ఎంపికై న విద్యార్థిని 4వ తేదీ వరకు తెనాలిలో జరిగే రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటున్నారు. విద్యార్థినితో పాటు పీడీలను ఆయన అభినందించారు.

నేడు ఖమర్ పీర్ ఖాద్రి సంస్మరణ సభ

ఆదోని రూరల్: ఇటీవల పరమపదించిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు డాక్టర్ సయ్యద్ ఖమర్ పీర్ ఖాద్రి సంస్మరణ సభ శనివారం నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారుడు ముబషీర్ పాషాఖాద్రి శుక్రవారం తెలిపారు. ఆదోనిలోని మాసుమ్‌పీర్ హుసేని దర్గాలో శనివారం సాయంత్రం వేడుకలు నిర్వహిస్తామన్నారు.

'కాంతి కిరణాలు' పుస్తకావిష్కరణ

పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబదహాల్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడిగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్న రచించిన 58వ పుస్తకం 'కాంతి కిరణాలు'లను గురువారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో వాల్మీకి సాంస్కృతిక సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది.

గూళ్యంలో శాంతి నెలకొల్పాలి

ఆదోని రూరల్: హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో శాంతి, సామరస్యం నెలకోల్పాలని వీఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాంభీంనాయుడు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో చిన్నపాటి ఘర్షణ పెద్ద వివాదంగా మారిందన్నారు. ప్రతిఒక్కరూ కులమతాలకు అతీతంగా స్నేహభావంతో మెలగాలని పిలుపునిచ్చారు. ఈ దిశగా అధికారులు ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరారు.

అమర వీరులకు ఘన నివాళి

ఎమ్మిగనూరుటౌన్: బడుగుల కోసం పోరాటాలు సాగించిన అమర వీరులు చంద్ర పుల్లారెడ్డి, నీలం రామచంద్రయ్యలకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఏఐటీయూసీ నాయకులు రాజు, ప్రసాద్ ఘనంగా నివాళులర్పించారు. అధ్యక్షుడు ఏసేపు, నల్లన్న, ఆనంద్ పాల్గొన్నారు.

నేనేమీ చేశాను పాపం?


పసికందును పరిశీలిస్తున్న పోలీసులు

ఆదోని అర్బన్: అమ్మా నేను ఏమి పాపం చేశాను?.... పుట్టిన క్షణాల్లోనే బయట ప్రపంచం చూడకుండానే కాలువలో పడేశావు. అందుకు ఊపిరి ఆడక ఎక్కడి నుంచి వచ్చానో మరలా అక్కడికే పంపించావు. అప్పుడే పుట్టిన మగశిశువును ఎవరో కాలువలో పడేశారు. గురువారం మధ్యాహ్నం స్థానిక వడ్డేగేరిలోని కాలువలో మగ పసి శిశువును స్థానికులు గుర్తించారు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించి మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి అప్పగించారు. శానిటేషన్ సూపర్‌వైజర్ మధు, సిబ్బంది రవితో పాటు సిబ్బంది ఆ మగ పసి శిశువును చూసి మానవత్వంతో శ్మశానంలో అంత్యక్రియలు చేశారు.

విద్యార్థుల పరిశ్రమల సందర్శన


యంత్రాల పనితీరును వివరిస్తునన టెక్నీషియన్

మంత్రాలయం: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు పరిశ్రమల సందర్శన చేపట్టినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ కె. ప్రసాద్ తెలిపారు. శుక్రవారం 9, 10, ఇంటర్మీడియట్ (ఐటీ-ఐటీఈఎస్) వృత్తి విద్యా విద్యార్థులు తుంగభద్రలో ఉన్న అదాని విల్‌మార్ కంపెనీని సందర్శించారు. కంపెనీలో యంత్రాలు పనిచేసే విధానాన్ని తెలుసుకున్నారు. వృత్తి విద్య శిక్షకులు పంపయ్య, సోఫియా బాను, షరీఫ్ వలి, రవిబాబులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కేసు నమోదు

ఆదోని రూరల్: పెసలబండ గ్రామానికి చెందిన శాంతి అనే మహిళను భర్త, మరిదులు అదనపు కట్నం వేధిస్తుండటంతో కేసునమోదు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర శుక్రవారం తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త చిన్నహనుమంతు, మరిదిలు రామాంజనేయులు, అంజిలపై అదనపు కట్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.